www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -38 గురువారం 8 మే 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545








# సెల్యూట్ సింధూర్

## 'ఆపరేషన్ సింధూర్'.. 80 మంది ఉగ్రవాదుల హతం!

### పాక్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత సాయుధ బలగాల మెరుపుదాడులు





పహల్గామ్ దాడికి ప్రతీకారంగా జైషే, లష్కరే, హిజ్బుల్ టెర్రర్ క్యాంపులే లక్ష్యం

బహావల్పూర్, మురిడ్కే స్థావరాల్లోనే 50-60 మంది ఉగ్రవాదులు హతం

భారత్ 'న్యాయం జరిగింది' అంటే.. 'యుద్ధ చర్య' అంటున్న పాక్

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ

ఉగ్ర స్థావరాలపై దాడుల అనంతరం రాష్ట్రపతితో ప్రధాని సమావేశం

భారత్‌పై దాడుల కుట్రలను భగ్నం చేయడమే లక్ష్యమని వెల్లడి



2లో


జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడ్డాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరిట నిర్వహించిన ఈ కచ్చితమైన దాడుల్లో 80 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు అత్యున్నత స్థాయి భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనతో ఇరు దేశాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.నిషేధిత ఉగ్రవాద సంస్థలైన జైషే మహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా (ఎల్ఈటీ), హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన మొత్తం తొమ్మిది స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి



## జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి, బావ సహా 10 మంది కుటుంబ సభ్యుల మృతి

కుటుంబ సభ్యులు చనిపోయినట్టు మసూద్ అజార్ స్వయంగా చెప్పినట్లు బీబీసీ ఉర్దూ కథనం

## కర్రెగుట్టల్లో భారీ ఎన్ కౌంటర్...



2లో

22 మంది మావోలు మృతి

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు

ఇప్పటివరకు 22 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు నిర్ధారణ

ఘటనా స్థలంలో కొనసాగుతున్న కాల్పులు, మృతుల సంఖ్య పెరిగే అవకాశం

## దేశ వ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ ప్రారంభం

యుద్ధం వస్తే ప్రజలు తమ ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన పెంచే కార్యక్రమం

50 ఏళ్ల తర్వాత మన దేశంలో తొలిసారి మాక్ డ్రిల్

దేశ వ్యాప్తంగా 244 ప్రాంతాల్లో మాక్ డ్రిల్



2లో

## హైదరాబాద్‌లో విజయవంతంగా మాక్ డ్రిల్

### సైరన్ మోగడంతో పలుచోట్ల ప్రజల అప్రమత్తం



హైదరాబాద్**మే 7ప్రజావినికిడి:** పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కోసం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహణ జరిగింది. నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, **మిగతాది 2లో...**

# అత్యవసర సేవలు సన్నద్ధం చేసుకోండి

### ఆపరేషన్ సిందూర్‌తో ప్రభుత్వం అప్రమత్తం -సైన్యానికి మనో ధైర్యం ఇచ్చేలా నేడు ర్యాలీ

ఆస్పత్రులు, మందుల నిల్వలు, రక్త నిల్వలు సన్నద్ధం చేసుకోండి

24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్

ఉద్యోగులు, అధికారులు, మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు

అధికారులతో అత్యవసర సమావేశంలో ఆదేశించిన సిఎం రేవంత్

హైదరాబాద్, **మే 7ప్రజావినికిడి:** 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా వెన్నంటి ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం



అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు. ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు**మిగతాది 2లో...**

# కృష్ణా నీటి అక్రమవాడకాలకు చెక్

### టెలీమెట్రీ ఏర్పాటు చేయాలి పోలవరం బ్యాక్ వాటర్ ముప్పు తప్పించాలి

### కేంద్ర జలసంఘాన్ని కోరిన మంత్రి ఉత్తమ్

న్యూఢిల్లీ, **మే 7ప్రజావినికిడి:** కృష్ణా నది నుంచి ఎపి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైన్ తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులతో పాటు అనేక అంశాలను చర్చించారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైతో కీలక




సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ,**మిగతాది 2లో...**

# చివరి ఉగ్రవాదిని ఏరివేసే వరకు 'ఆపరేషన్ సిందూర్' కొనసాగాలి

ఆపరేషన్ సిందూర్.. బలగాలకు పవన్ సెల్యూట్

సైనిక చర్యలపై ఎవ్వరూ అతిక్రమించి పోస్టులు పెట్టరాదు -పెడితే ఖబర్దార్ అని హెచ్చరించిన పవన్ కళ్యాణ్



# సెల్యూట్ సింధూర్

హైదరాబాద్, **మే 7ప్రజావినికిడి:**
పహల్గామ్‌లో 26 మంది అమాయక పౌరుల మృతికి కారణమైన దాడికి ప్రతిచర్యగానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది.
అధికార వర్గాల సమాచారం ప్రకారం.. జైషే మహమ్మద్‌కు బలమైన పట్టున్న బహవల్పూర్, లష్కరే తోయిబా కీలక కేంద్రమైన మురిడ్కేలోని మసీద్ వా మర్కజ్ తైబాపై జరిగిన దాడుల్లో అత్యధికంగా నష్టం వాటిల్లింది. ఈ రెండు ప్రాంతాల్లోనే సుమారు 25 నుంచి 30 మంది చొప్పున ఉగ్రవాదులు హతమైనట్లు అంచనా. మురిడ్కేలోని స్థావరం పాకిస్థాన్‌లో 'ఉగ్రవాద నర్సరీ'గా, లష్కరే సైద్ధాంతిక ప్రధాన కార్యాలయంగా దీర్ఘకాలంగా పరిగణిస్తున్నారు. లక్షిత దాడులకు గురైన ఇతర ప్రాంతాల్లో మృతుల సంఖ్యను నిఘా సంస్థలు ఇంకా ధ్రువీకరిస్తున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 80 నుంచి 90 మంది ఉగ్రవాదులు హతమై ఉంటారని భావిస్తున్నారు.
ఈ దాడుల్లో ఉగ్రవాదులను సరిహద్దు దాటించేందుకు వినియోగించే లాంచ్ ప్యాడ్‌లు, శిక్షణా కేంద్రాలు, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించే కేంద్రాలు ధ్వంసమైనట్లు సమాచారం. ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించిన జైషే మహమ్మద్, లష్కరే తోయిబా సంస్థలే ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి.
దాడుల అనంతరం, భారత సైన్యం 'ఎక్స్'లో ఒక వీడియోను విడుదల చేస్తూ 'న్యాయం జరిగింది' అని ఓ సందేశాన్ని పోస్ట్ చేసింది. అయితే, ఈ దాడులను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఇది 'నిస్సిగ్గుగా చేసిన యుద్ధ చర్య' అని అభివర్ణించింది. ఈ దాడుల్లో ఒక చిన్నారితో సహా ఎనిమిది మంది పౌరులు మరణించారని ఆరోపించింది.
లక్షిత దాడులకు గురైన ఇతర ప్రాంతాలలో జైషే మహమ్మద్‌కు చెందిన తెహ్రా కలాన్‌లోని సర్జల్, కోట్లీలోని మర్కజ్ అబ్బాస్, ముజఫరాబాద్‌లోని సయ్యద్నా బిలాల్ క్యాంప్ ఉన్నాయి. అలాగే, లష్కరే తోయిబాకు సంబంధించిన బర్నాలాలోని మర్కజ్ అహ్లే హదీస్, ముజఫరాబాద్‌లోని శ్వవాయ్ నల్లా క్యాంప్‌లపై కూడా దాడులు జరిగాయి. హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన కోట్లీలోని మకజ్ రహీల్ షాహిద్, సియాల్‌కోట్‌లోని మెహమూనా జోయా శిక్షణ కేంద్రాలు కూడా ధ్వంసమైన వాటిలో ఉన్నాయి.



మొత్తం తొమ్మిది లక్షిత స్థావరాల్లో నాలుగు పాకిస్థాన్ భూభాగంలో ఉండగా, మిగిలిన ఐదు పీవోకేలో ఉన్నాయి. ఈ దాడుల్లో పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే, ఉగ్రవాద శిక్షణ మౌలిక సదుపాయాలకు పాక్ సైన్యం, ఐఎస్ఐ, స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) వర్గాలు మద్దతునిస్తున్నాయని ఆరోపణలున్నాయి.
ఈ దాడుల అనంతరం, పాకిస్థాన్ దళాలు జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ), అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి భారీగా కాల్పులకు, మోర్టార్ల దాడులకు తెగబడ్డాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు భారతీయ పౌరులు మరణించినట్లు అధికారులు తెలిపారు. భారత భద్రతా దళాలు కూడా దీటుగా స్పందించాయి. తాజా సమాచారం అందేసరికి ఇరువైపులా కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ



**మే 7ప్రజావినికిడి:**
పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు బుధవారం తెల్లవారుజామున కచ్చితమైన దాడులు నిర్వహించాయి. ఈ కీలక పరిణామం అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యకు సంబంధించిన వివరాలను ప్రధాని రాష్ట్రపతికి వివరించారు.ఈ దాడుల్లో భాగంగా, పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం) వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది కీలక స్థావరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ధ్వంసం చేసిన వాటిలో ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు కూడా ఉన్నాయని తెలిసింది. భారతదేశంపై ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించడం, వాటిని నిర్దేశించడం వంటి కార్యకలాపాలు ఈ కేంద్రాల నుంచే జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతోనే సైన్యం ఈ దాడులు చేపట్టింది.
రెండు వారాల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఒక నేపాల్ దేశస్థుడితో సహా 26 మంది అమాయక పౌరులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటన జరిగిన అనతికాలంలోనే భారత సాయుధ దళాలు ఈ ప్రతిదాడులకు దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని భారత్ మరోసారి స్పష్టం చేసినట్లయింది.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్ కౌంటర్...

### 22 మంది మావోలు మృతి

**మే 7ప్రజావినికిడి:**
తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల్లో ఈ ఉదయం భద్రతా బలగాలు మరియు మావోయిస్టుల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 22 మంది మావోయిస్టులు మరణించినట్లు అధికార వర్గాలు ప్రాథమికంగా వెల్లడించాయి. ప్రస్తుతం ఘటనా స్థలంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని సమాచారం.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల సమీపంలోని అటవీ ప్రాంతమైన కర్రెగుట్టలను లక్ష్యంగా చేసుకుని భద్రతా బలగాలు ఈ భారీ ఆపరేషన్‌ను చేపట్టాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), కోబ్రా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), బస్తర్ ఫైటర్స్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) కు చెందిన బలగాలు సంయుక్తంగా ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. ఈ కీలక ఆపరేషన్‌ను అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) వివేకానంద సిన్హా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందరరాజ్ లు ఎప్పటికప్పుడు ఆపరేషన్ పురోగతిని సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలోని బలగాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఎదురుకాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## దేశ వ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ ప్రారంభం

న్యూఢిల్లీ **మే 7ప్రజావినికిడి:**
పాకిస్థాన్ తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ... ఒకవేళ యుద్ధం వస్తే ప్రజలంతా ఎతమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలనే విషయంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు దేశ వ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ ప్రారంభమయింది. 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట చేపట్టిన ఈ మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలయింది. దాదాపు 50 ఏళ్ల తర్వాత ఈ మాక్ డ్రిల్ ను దేశంలో చేపట్టారు. దేశ వ్యాప్తంగా మొత్తం 244 ప్రాంతాల్లో మాక్ డ్రిల్ జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే హైదరాబాద్, విశాఖపట్నంలో మాల్ డ్రిల్ జరుగుతోంది. హైదరాబాద్ లో సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్, డీఆర్డీవో, మౌలాలిలో మాక్ డ్రిల్ కొననాగుతోంది. విశాఖలో రెండు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ జరుగుతోంది. ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సివిల్ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణశాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు
సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్ డీఓ, మౌలాలి ఎన్ఎఫ్‌సా÷ఖలో అధికారులు మాక్ డ్రిల్ జరగ్గా.. వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు అవగాహన కల్పించారు. దాదాపు అరగంట పాటు– ఈ కార్యక్రమం కొనసాగింది.

## అత్యవసర సేవలు సన్నద్ధం చేసుకోండి

(మొదటి పేజి తరువాయి)
ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్,హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు– ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు– సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు– భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ– సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్‌లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## కృష్ణా నీటి అక్రమవాడకాలకు చెక్

(మొదటి పేజి తరువాయి)
సమ్మక్క సారక్క, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్‌లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్.. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. డీపీఆర్‌లో చూపిన స్థలం ఒకటి కాగా, అసలు నిర్మాణం వేరే ప్రాంతంలో జరిగిందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్ఏ సూచించిందని చెప్పారు.అలాగే నూతన నిర్మాణాలు, కేటాయింపులపై ఆయన చర్చించారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించనున్నట్లు– వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీ–ఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు– పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీ–ఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## చివరి ఉగ్రవాదిని ఏరివేసే వరకు 'ఆపరేషన్ సిందూర్' కొనసాగాలి

హైదరాబాద్,**మే 7ప్రజావినికిడి:**
'భారతదేశ సమగ్రతను దెబ్బ తీసేందుకు ప్రయత్నించి, పహల్గాంలో 26 మంది సామాన్యులను బలిగొంటూ చేసిన ఉగ్రవాద దాడిని ప్రతి ఒక్కరం చూసాము. ఇందుకు ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ దేశం ఎదురు చూసింది. చివరి ఉగ్రవాదిని అంతం చేసే వరకు ఆపరేషన్ సిందూర్ ఆగకూడదు' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రతి భారతీయుడి సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ కీలక సమయంలో దేశ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి, ఐక్యతను ప్రదర్శించాలన్నారు. దేశంపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు తీవ్రంగా పరిగణించాలని, భారత సైన్యం చర్యలకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్ లోని ఆయన నివాస%శీ% వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ కు పూర్తి స్థాయిలో మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పాకిస్థాన్ లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు. పాక్ సైనిక కేంద్రాల జోలికి పోకుండా, సాధారణ పౌరులకు ఇబ్బందులు కలుగకుండా ఉగ్రవాద సంస్థలకు చెందిన శిబిరాలే లక్ష్యంగా భారత సైన్యం ముందుకు సాగడం అభినందనీయం. క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు తీసుకునే ప్రతి నిర్ణయానికి ప్రజలంతా కట్టబడి ఉండాలి. భారతదేశ ఐక్యతను చాటాలి. ఉగ్రదాడులపై బదులివ్వాలని ప్రతీ ఒక్క భారతీయుడు కోరుకున్నాడు ఏప్రిల్ 22వ తేదీన పెహల్గాంలో ఉగ్రవాదులు మతం పేరిట మారణహోమం సృష్టించారు. 26 మంది పర్యటకులను దారుణంగా చంపేశారు. ఈ ఘటనతో దేశం మొత్తం శోకంలో మునిగిపోయింది. హిందువా? ముస్లిమా? అని అడిగి పర్యాటకులను చంపిన విధానం దారుణం. కలిమా చదవమని హిందువా, ముస్లిమా అని గుర్తించి మరీ చంపారు. ఇలాంటి ఘాతుకానికి దేశం సరైన రీతిలో బదులివ్వాలని ప్రతి ఒక్క భారతీయుడు కోరుకున్నాడు. గత రాత్రి భారత సైన్యం 9 ప్రధాన ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు జరపడంతో మనం ఆపరేషన్ సిందూర్ ను మొదలుపెట్టాం. 15 నుంచి 200 కిలోమీటర్ల లోపలి వరకు భారత సైన్యం వెళ్లి, ఉగ్రవాద సంస్థలకు చెందిన శిబిరాలపై దాడులు చేసి ధ్వంసం చేయడం ఉగ్రవాదులకు భారత్ ఇచ్చిన జవాబు హర్షణీయం.

**ప్రతిసారి సహనం.. సహనం అంటూనే ఉన్నాం**
కశ్మీర్ భారత దేశంలో అంతర్భాగం. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రమూకలు కశ్మీరీ పండిట్స్ ని చంపేశారు. అంత్యక్రియలు చేయడానికి



శ్మశానానికి తీసుకువెళ్లిన వారిని కూడా చంపేశారు. హిందువుల మీద దాడి అనాదిగా జరుగుతూనే ఉంది. సరైన సమయంలో సరైన చర్య మోదీ తీసుకున్నారు. మన ఆర్మీ చేపడుతున్న చర్యలకు మద్దతు ఇస్తున్నాం. మేమంతా మీతో ఉన్నాం. ప్రత్యేకించి యుద్ధం సమయంలో పాకిస్థాన్ కి గట్టి పాఠం నేర్పాల్సి ఉంది. గతంలో లుంబినీ పార్క్, గోకుల్ చాట్ తదితర ప్రాంతాల్లో దాడులు జరిగాయి. ఏ ఘటన జరిగినా, ఎలాంటి ఉపద్రవం ఎదురైనా– సహనం, శాంతి అంటూనే ఇంతవరకు తెచ్చుకున్నాం. ఇప్పుడు గట్టిగా గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చింది. మితిమీరిన సహనంతో చేతులు కట్టేసిన సమస్త భారతానికి ఆపరేషన్ సిందూర్ తిరిగి వీరత్వాన్ని నింపింది.

**సెలబ్రిటీలు సైతం బాధ్యతగా వ్యవహరించాలి**
శ్రీ మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అణగదొక్కేందుకు కఠిన చర్యలు తీసుకుంటోంది. మిలటరీ దళాలు యుద్ధం చేస్తున్నప్పుడు ఎవరూ, ఎక్కడా జాతీయ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదు. ఆ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారాహిత్యంగా పోస్టులు పెట్టవద్దు. సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా కుక్కలా మొరగవద్దు. క్లిష్ట సమయంలో శ్రీ మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి. త్రివిధ దళాల పోరాటాన్ని కించపరచేలా, దేశ సమగ్రతకు భంగం వాటిల్లేలా ఎవరు కామెంట్స్ చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ డీజీపీ గారికి సూచించాను" అన్నారు.ఈ సందర్భంగా ఒక ప్రశ్నకు సమాధానంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "దేశాన్ని సెలబ్రిటీలు నడిపించడం లేదు. వారే దేశం మొత్తం గొంతుక కాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వారు కూడా ఈ తరుణంగా బాధ్యతగా దేశ సమగ్రత కాపాడేలా మాట్లాడాలి.పాకిస్థాన్ మీదా ప్రేమ ఉంటే అక్కడికే వెళ్లిపోవాలి అనే మాట విషయంలో – పాకిస్థాన్ కి అనుకూలంగా మాట్లాడే కొద్దిమంది కాంగ్రెస్ నాయకులు అని మాత్రమే చెప్పాను. నేను చేసిన వ్యాఖ్యలకు జవాబుదారీతనంగా ఉంటాను. క్లిష్ట సమయంలో ప్రభుత్వానికి అండగా నిలబడాలి. పాకిస్థాన్ కు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నాయకులకు మాత్రమే నేను చెప్పాను. వారు తమ వైఖరి మార్చుకుంటే మంచిదే కదా.. ఇది దేశం మొత్తం చేస్తున్న యుద్ధం. ఇలాంటి సమయంలో పాకిస్థాన్ కి మద్దతుగా మాట్లాడడం తప్పు అని మాత్రమే చెప్పాను.
ఘాజీ లాంటి సబ్ మెరైన్లు విశాఖ వరకూ వచ్చాయని గుర్తుంచుకోవాలి ఎవరి పని వారు శ్రద్ధగా, నిబద్ధతతో జాతి ప్రయోజనాల కోసం చేసుకోవాలి. దేశాన్ని ప్రేమించాలి. ఉద్రికత్త పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో సహా అన్ని రాష్ట్రాలూ కేంద్రానికి మద్దతుగా నిలబడతాయి. ఈ రోజు మాక్ డ్రిల్ దేశవ్యాప్తంగా జరుగుతోంది. ఎవరికి వారు బాధ్యతతో మాట్లాడాలి. సోషల్ మీడియాలో సైతం జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఏ మాత్రం ఇష్టానుసారం మాట్లాడినా చట్ట ప్రకారం చర్యలుంటాయి. కేవలం ఇది సరిహద్దుల్లో జరుగుతున్న వ్యవహారం కాదు. ఆంధ్రప్రదేశ్ కు కూడా 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ప్రమాదం ఎటు వైపు నుంచి అయినా మన మీదకు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఘాజీ లాంటి సబ్ మెరైన్లు విశాఖ తీరం వరకు వచ్చాయంటే దాని అర్థం... మనకు ప్రమాదం అన్ని వైపుల నుంచి పొంచి ఉంది. కాబట్టి ప్రజలంతా నిరంతరం అప్రమత్తంగా ఉండటం ప్రధానం. అందులోనూ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మరింత జాగ్రత్త అవసరం" అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 8 మే 2025

# "పది"లో ది కౌల్డ్రాన్ హైస్కూల్ విద్యార్థిని దేవిషి ఝూన్సీకి అత్యధిక మార్కులు

### దేవేషిని సత్కరించిన పాఠశాల నిర్వాహకులు..


**ప్రజావినికిడి,(చంపాపేట):**
ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చంపాపేటలోని ది కౌల్డ్రాన్ హైస్కూల్ కు చెందిన విద్యార్థిని గుమ్మల్ల దేవేషి 587/600 మార్పులను సాధించింది. అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థిని గుమ్మల్ల దేవేషిని పాఠశాల నిర్వాహకులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ అనుభవం కలిగిన అధ్యాపక బృందంచే పాఠాలను బోధించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించగలిగామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి..

### మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ లోని 191 ఎన్టీఆర్ నగర్ లో తమిళ బోనాలు సందర్భంగా ముత్యాలమ్మ దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మవారి దయ వల్ల ప్రజలంతా సురక్షితంగా సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ దేవాలయ చైర్మన్ మంజునాథ్,తమిళ బోనాలు కమిటీ సభ్యులు లక్ష్మి,కాలప్ప, దేవరాజ్,శ్రీను,మాయ కుమార్,శివ అప్ప, తదితరులు పాల్గొన్నారు.



# 20మే 2025 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలి - సిఐటీయు..

### కార్మికుల హక్కులను పరిరక్షించాలి -లేబర్ కోడ్స్ అమలు చేయొద్దు..

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి అలాగే అలీఫ్ ఇండస్ట్రియల్ ఏరియాలలో 20 మే 2025 దేశభక్తి సమ్మెను జయప్రదం చేయడానికి యాజమాన్యాలు సహకరించాలని సమ్మె నోటీసులు బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల పైన కార్మిక హక్కుల పైన ఎక్కుపెట్టిన యుద్ధంలో దేశవ్యాప్తంగా కార్మిక లోకం ఐక్యమై పోరాటం చేస్తున్నదని అన్నారు. యుద్ధంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలకు,కార్మికులను బానిసలుగా మార్చే కార్మిక కోడ్లు అమలు చేయాలనే ఆపేక్ష అనేది ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. ముఖ్యంగా పని గంటలు పెంపుదల అదేవిధంగా పని పరిస్థితులలో మార్పులు ట్రేడ్ యూనియన్ హక్కులను హరించడం శ్రమ దోపిడీని తీవ్రతరం చేయడం కార్పొరేట్ల లాభపేక్ష నెరవేర్చడం కోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేటీకరణ ఆపాలని కాంట్రాక్టు విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలుగా నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భీ.మణిక్యం,ప్రవీణ్, నీరుడి యాదయ్య,కే. ఆంజనేయులు,పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.



# అపురూప కాలనీలో మన్యం దొర అల్లూరి వర్ధంతి వేడుకలు..

### ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కేపి.వివేకానంద్..



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** 130-సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ చౌరస్తాలో నిర్వహించిన మన్యం దొర అల్లూరి వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ధైర్యం,త్యాగం,దేశభక్తి, స్వాతంత్ర పోరాటంలో చిరస్మరణీయంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు,డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్,రుద్ర అశోక్, పుష్పాల భాస్కర్,శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్,సీనియర్ నాయకులు పందిరి యాదగిరి,గుబ్బల లక్ష్మీనారాయణ, పిఎస్ఎన్ రాజు, రామకృష్ణ, వల్లభనేని రమణ,శేషా చారి, దుర్గా రావు,టెంపుల్ కమిటీ ప్రెసిడెంట్ తిప్పా రెడ్డి,సెక్రెటరీ కంచ కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజబాబు,కోశాధికారి మస్తాన్ బాబు,కమిటీ సభ్యులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేనెంబర్ 354 లోని ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా అధికారులకు అభినందనలు..

### సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్..

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని కెఎల్ యూనివర్సిటీ కబ్జా చేసిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని,అలాగే సర్వేనెంబర్ 354లో ఉన్నటువంటి 12ఎకరాల భూముల లో నిర్మాణమైన అక్రమ నిర్మాణాలను నిన్న సాయంత్రం హైడ్రాధికారులు కూల్చివేసి అక్కడ ప్రభుత్వ భూమి అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేయడాన్ని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి అభినందిస్తుందని ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీ,అదేవిధంగా 354లో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను కాపాడాలని గత కొద్ది రోజులుగా పత్రికా విలేకరులు,కొన్ని సామాజిక సంస్థల నాయకుల తో పాటు సిపిఐ పార్టీగా ప్రభుత్వ అధికారులకు ఆ స్థలాన్ని కాపాడాలని అనేక వినతులు ఇచ్చిందని అందులో భాగంగానే నేడు హైడ్రా అధికారులు కాపాడారని ఈ ప్రభుత్వ భూములను కాపాడటానికి ప్రయత్నించిన ప్రతి ఒక్కరికి సిపిఐ పార్టీ అభినందనలు తెలియజేస్తున్నది,ఈ నియోజకవర్గంలో ఉన్నటువంటి రాజకీయ పార్టీలు ప్రభుత్వ భూముల



పరిరక్షణ కొరకు మాట్లాడకపోవడం దారుణమని దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు కుత్బులాపూర్ నియోజకవర్గంలో పోరాటం చేస్తున్న ఒకే ఒక పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. హైడ్రా అధికారులు కేవలం సర్వే నెంబర్ 354లోని భూములనే కాకుండా గాజులరామారంలో సర్వేనెంబర్ 329, 342, 326, 307,లలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కూడా కాపాడాలని కేవలం ఒక దగ్గర కాపాడి మరోచోట కాపాడకపోవడాన్ని అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. కావున ఇలాంటి అనుమానాలకు తావు లేకుండా హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి అన్యాక్రాంతమైనటువంటి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ఇండ్లు ఇండ్ల స్థలాలు లేని పేదలను కలుపుకొని ప్రభుత్వ భూములను కాపాడుకుంటామని అది ప్రజలదే కాబట్టి ప్రజలకు చెందేలా పోరాటం చేస్తామని ఆ దిశగా ప్రజలను సమీకృతం చేసామని వారిని పోరాటాల కోసం సన్నద్ధం చేస్తున్నామని అన్నారు.
ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు ఇప్పటికైనా మిగతా రాజకీయ పక్షాలన్నీ సిపిఐ పార్టీ చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. అది నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

# నాట్కో ట్రస్ట్ వారు నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలు,గ్రామ పంచాయతీ భవనం, జిల్లా పరిషత్ స్కూల్ ను ప్రారంభించిన ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు..

### హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లికెశంకర్..

**ప్రజావినికిడి, (షాద్ నగర్):** నియోజకవర్గంలో నాట్కో ట్రస్ట్ ద్వారా చాకలిదాని గుట్ట తండా,సంగీగూడ,నందిగామ మండల కేంద్రంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను,మేక గూడ లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం,కొత్తూరు మున్సిపాలిటీ లో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకై ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని అన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు,డీఎస్సీ తో ఖాళీల



భర్తీ,అమ్మ ఆదర్శ బడులతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,తొలి నుంచి నాట్కో పరిశ్రమ యాజమాన్యం జనహిత కార్యక్రమాలు చేపడుతూ



జనాల్లో మంచి పేరును సంపాదించిందని,మంచి పనులు చేసే ప్రతి పరిశ్రమకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడే ప్రతి పరిశ్రమకు రుణపడి ఉంటామని తెలిపారు.

# ఆపరేషన్ సింధూర్ తో పాక్ కు గుణపాఠం చెప్పిన భారత్..

**మోడీ గారు ఏ చర్య చేపట్టినా 140 కోట్ల భారతీయులు అండగా నిలవాలి..**

**భారత సైన్యం తలుచుకుంటే ప్రపంచ పటంలో PAK ఉండదు..**

**ఆపరేషన్ విజయవంతం అయిన సందర్బంగా రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారికి ధన్యవాదములు..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
పాక్ లోని ప్రజాప్రతినిదులు ఉగ్రవాధులను ప్రోత్సహిస్తూ,తీవ్రవాదాన్ని పెంచుతున్నారని శ్రీవర్ధన్ రెడ్డి గారు మండిపడ్డారు.
ఇటీవల కాశ్మీర్ ప్రాంతం పహాల్గం లో పాక్ ఉగ్రవాదులు విచక్షణారహితంగా చేసిన దాడిలో



అమాయకులైన 26 మంది భారతీయ హిందువులు చనిపోయారని, మహిళల ముందు మగవారి బట్టలు విప్పి మతం అడిగి నుదుటన క్రూరంగా కాల్చి చంపి హిందూ మహిళల నుదుటి సిందూరం తుడిచారు ఈ చర్యను ప్రపంచం అంత ఖండించింది .పహల్గామ్ దాడి అత్యంత హేయమైనదని తెలిపారు.
అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలను పాక్ తప్పుదారి పట్టిస్తోందని, ఉగ్రవాదానికి పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందని అన్నారు. ముంబై దాడుల తర్వాత ఇదే పెద్ద దాడి అని, జమ్మూకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవడమే ఉగ్రవాదుల పన్నాగమని చెప్పారు. పహల్గామ్ దాడికి దీటైనా చర్యగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారత సైన్యం పాక్ లోని ఉగ్రవాదుల 9 స్థావరాలపై దాడి చేసి, 80 మంది ఉగ్రవాదులను మట్టుపెట్టిందని అన్నారు. వీర వనితలు పుట్టిన నేల భారతదేశం అని, ఆపరేషన్ సింధూర్ లో తొలిసారి ఆర్మీ మహిళలు పాల్గొని త్రివిద దళాల సాక్షిగా మిస్సైళ్ల రూపంలో దూసుకెళ్లి ఉగ్రమూకలను మట్టుబెట్టారని అన్నారు. %ఎ%ఇప్పటికైనా భారత్ పై పాక్ తీవ్రవాద దాడులను ఆపాలని,లేదంటే భారత సైన్యం తలుచుకుంటే ప్రపంచ పటంలో పాక్ ఉండదని హెచ్చరించారు. అదేవిధంగా ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి వర్యులు రాజ్ నాథ్ సింగ్కి శ్రీవర్ధన్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు.

# పాతబస్తీలో హైడ్రా కూల్చివేతలు... ఎంఐఎం నిరసనలు

**హైదరాబాద్ మే 7ప్రజావినికిడి:**
హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. చంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ మండలం, అక్బర్ నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ సర్వే నంబర్లు 303 నుంచి 306 వరకు విస్తరించి ఉన్న సుమారు 2000 గజాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని గుర్తించిన హైడ్రా బృందం వాటిని కూల్చివేసింది.
ఇటీవలి కాలంలో చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ తాజా చర్యలతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అయితే, హైడ్రా చేపట్టిన ఈ కూల్చివేత కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఎంఐఎం కార్పొరేటర్లు, మహిళా



నాయకులు ఆందోళనకు దిగారు. "హైడ్రా రంగనాథ్ డౌన్ డౌన్" అంటూ వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.
ఈ నిరసనల నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న పలువురు ఎంఐఎం నాయకులు మరియు మహిళా నాయకులను అదుపులోకి తీసుకున్నారు. హైడ్రా దాడుల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.
ప్రభుత్వ స్థలాలు లేదా చెరువు శిఖం భూముల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే, ఆ సమాచారాన్ని తమకు అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారుల వర్గాలు ఈ సందర్భంగా స్పష్టం చేశాయి. అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ భూముల పరిరక్షణే తమ లక్ష్యమని వారు తేల్చిచెప్పారు.

# టెస్టు ఫార్మాట్‌కు రోహిత్ గుడ్‌బై



## హిట్‌మ్యాన్ అనూహ్య నిర్ణయం -వన్డేలలో కొనసాగుతానని ప్రకటన

**వరుస పరాభవాలూ.. తన సారథ్యంపై విమర్శలూ.. పేలవ ఫామూ.. కారణం ఏదైనా హిట్‌మ్యాన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు.ఎలాంటి హంగూ, ఆర్భాటం లేకుండా, అందరినీ ఆశ్చర్యపరుస్తూ సంప్రదాయ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.**

**భారత క్రికెట్‌లో ఆటగాడిగా, నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న రోహిత్ శర్మ తన బాధ్యతలను 'పరిమితం' చేసుకుంటూ టెస్టులకు గుడ్‌బై పలికాడు. గతేడాది ప్రపంచకప్ అనంతరం టీ20లకు దూరమైన రోహిత్.. ఇక వన్డేల్లో మాత్రం కొనసాగుతానని ప్రకటించాడు.**

న్యూఢిల్లీ: సుదీర్ఘకాలంగా వస్తున్న ఊహాగానాలకు రోహిత్ శర్మ తెరదించాడు. టెస్టుల నుంచి రిటైరవుతున్నట్టు బుధవారం రాత్రి ప్రకటించాడు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపాడు. దాంతో క్రికెట్‌లో రెండు ఫార్మాట్లకు హిట్‌మ్యాన్ వీడ్కోలు పలికినట్టయ్యింది. గత ఏడాది జూన్‌లో టీ20 వరల్డ్ కప్‌ను తన సారథ్యంలో అందించిన అనంతరం రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇక సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్న విషయాన్ని రోహిత్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. 'అందరికీ హాయ్..టెస్టుల నుంచి నేను రిటైర్ అవుతున్న విషయాన్ని మీతో పంచుకుంటున్నా. సుదీర్ఘ ఫార్మాట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఇన్ని సంవత్సరాలుగా నాకు మద్దతుగా నిలిచి, నాపై ప్రేమాభిమానాలు కురిపించిన అందరికీ కృతజ్ఞతలు. వన్డేలలో మాత్రం భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తా' అని టెస్టుల్లో తాను ధరించే టోపీతో కలిపి 38 ఏళ్ల రోహిత్ తన ప్రకటనను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. కాగా, ఇటీవలే రోహిత్ కెప్టెన్సీలో ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ టైటిల్‌ను టీమిండియా సొంతం చేసుకోవడం విశేషం.

**అందుకేనా నిర్ణయం?**

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీసకు త్వరలోనే భారత జట్టును ఎంపిక చేయనున్నారు. మరోవైపు కొత్త సారథితోనే 2025-27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప సైకిల్‌ను టీమిండియా ప్రారంభించాలని సెలెక్టర్లు నిర్ణయించినట్టు తెలిసింది. దాంతో కెప్టెన్‌గా రోహిత్‌ను తొలగించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే హిట్‌మ్యాన్ టెస్టులకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్టు భావిస్తున్నారు.

**వారసుడు ఎవరు?**

రోహిత్ రిటైర్ కావడంతో టెస్టుల్లో భారత జట్టుకు కొత్త కెప్టెన్ రానున్నాడు. అయితే, రోహిత్ వారసుడు ఎవరనేది ఇప్పుడు ఆసక్తికరం. బుమ్రా, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ రేసులో ఉంటారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప కొత్త సైకిల్‌ను జూన్‌లో ఇంగ్లండ్‌తో ఆ దేశంలో జరిగే సిరీసతో భారత్ ప్రారంభించనుంది. త్వరలోనే జాతీయ సెలెక్షన్ కమిటీ ఈ సిరీసకు సారథితోపాటు జట్టును ఎంపిక చేయనుంది.

**ఒడిదుడుకులు..**

2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప ఫైనల్లో రోహిత్ సారథ్యంలోనే ఆస్ట్రేలియాతో భారత్ తలపడింది. ఆ సైకిల్ టెస్టు చాంపియన్‌షిపలో భారత్ ప్రశంసనీయంగానే రాణించింది. కానీ ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్‌తో, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీసలో భారత జట్టు దారుణ వైఫల్యాలు చవిచూసింది. ఈ సిరీసలలో బ్యాటర్‌గా కూడా రోహిత్ పూర్తిగా నిరాశ పరిచాడు. పైగా..బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్టు నుంచి రోహిత్ తనంతటతాను వైదొలిగాడు. దాంతో అప్పట్లోనే అతడు టెస్టుల నుంచి రిటైర్ అవుతాడనే ఊహాగానాలు వెల్లువెత్తాయి. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ప్రారంభం కానుండడంతో గత కొన్ని రోజులుగా రోహిత్ రిటైర్మెంట్‌పై తిరిగి వార్తలు షికారు చేస్తున్నాయి.

**అరంగేట్రం ఘనంగా..**

ఓవరాల్‌గా కెరీర్‌లో 67 టెస్టులాడిన రోహిత్ 2021లో విరాట్ కోహ్లీ నుంచి సుదీర్ఘ ఫార్మాట్ పగ్గాలు స్వీకరించాడు. రోహిత్ సారథ్యంలో 24 టెస్టులు ఆడిన భారత్.. 12 మ్యాచ్‌ల్లో గెలుపొందింది. తొమ్మిదింటిలో ఓడిపోయింది. మూడు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. పరిమిత ఓవర్ల ఆటలో తిరుగులేని మొనగాడుగా పేరుపొందిన రోహిత్ టెస్టుల్లో మాత్రం పెద్దగా రాణించలేకపోయాడు. సుదీర్ఘ ఫార్మాట్ అరంగేట్రం ఘనంగా చేసినా.. తర్వాత..తర్వాత..అదే స్థాయిలో సత్తా చాటలేకపోయాడు. ఒకే ఆర్డర్‌లోగాక ఓపెనర్‌గా, వివిధ స్థాయిల్లో బ్యాటింగ్ చేయడం టెస్టుల్లో రోహిత్ అంతగా ఆకట్టుకోలేకపోవడానికి కారణంగా చెబుతారు. 2013లో స్వదేశంలో వెస్టిండీసతో జరిగిన సిరీస్ దిగ్గజ బ్యాటర్ సచిన్‌కు వీడ్కోలు. ఆ సిరీసలో ఈడెన్‌గార్డెన్స్ మ్యాచ్‌లో రోహిత్ టెస్టుల్లో అడుగుపెట్టాడు. 177 పరుగులతో భళా అనిపించాడు. సొంత గ్రౌండ్ ముంబైలో జరిగిన రెండో టెస్టులో మరో శతకం (111 నాటౌట్)తో వహ్వా అనిపించాడు. తర్వాత నిలకడ లోపించడంతో టెస్ట్ జట్టులో సుస్థిర స్థానం సంపాదించలేకపోయాడు. 2019లో దక్షిణాఫ్రికాపై టెస్టులో డబుల్ సెంచరీ (212) చేయడం రోహిత్‌కు అత్యుత్తమ ప్రదర్శన.

---

## జైషే చీఫ్ మసూద్ అజార్ సోదరి, బావ సహా 10 మంది కుటుంబ సభ్యుల మృతి



కుటుంబ సభ్యులు చనిపోయినట్టు మసూద్ అజార్ స్వయంగా చెప్పినట్లు బీబీసీ ఉర్దూ కథనం

పాకిస్థాన్ భూభాగం మరియు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత భద్రతా దళాలు ఈ తెల్లవారుజామున దాడులు చేపట్టాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ చర్యల్లో జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత మసూద్ అజార్ కుటుంబ సభ్యులు మరణించినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

తెల్లవారుజామున 1.05 గంటల సమయంలో, పాకిస్థాన్ మరియు పీఓకేలోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత వైమానిక దళాలు క్షిపణులతో విరుచుకుపడ్డాయి. జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-ఎ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన స్థావరాలను ఈ దాడుల్లో లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా, పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో భారత సైన్యం జరిపిన దాడుల్లో జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు చెందిన 10 మంది కుటుంబ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మసూద్ సోదరి, బావ, మేనల్లుడు సహా 10 మరణించారు.ఈ దాడుల్లో తన కుటుంబానికి చెందిన 10 మంది సభ్యులతో పాటు నలుగురు సహాయకులు కూడా మరణించారని మసూద్ అజార్ స్వయంగా పేర్కొన్నట్లు బీబీసీ ఉర్దూ కథనాలు ప్రచురించాయి. ఈ వార్త ఉగ్రవాద వర్గాల్లో తీవ్ర కలకలం రేపినట్లు సమాచారం.

---

## ఉగ్రస్థావరాలను గుర్తించడంలో కీలక భూమిక

## తెరవెనక పనిచేసిన ఎన్‌టిఆర్‌వో సంస్థ

పహల్గామ్‌కు భారత సైన్యం ప్రతీకారం తీర్చుకున్న వేళ లక్ష్యాన్ని ఖచ్చితంగా గుర్తించడంలో కీలక పాత్ర ఎవరన్నది చర్చ సాగుతోంది. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక ఉన్న ఏజెన్సీ ఏంటి? అనే విషయాలపై చర్చ సాగుతోంది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఆర్మీ నేలమట్టం చేసింది. దాడిలో సుమారు 30 మంది ఉగ్రవాదులను మట్టు బెట్టింది. బుధవారం తెల్లవారుజామున భారత సాయుధ దళాలు బహవల్‌పూర్‌లోని జైష్-ఎ- మొహమ్మద్ బలమైన స్థావరం, మురిద్కేలోని లష్కరే-ఎ-తోయిబా స్థావరంతో సహా తొమ్మిది ఉగ్రవాద లక్షయాలపై క్షిపణి దాడులు నిర్వహించాయి. అయితే, పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు దాక్కున్న ప్రదేశాలను భారతదేశం ఎలా ట్రాక్ చేసిందన్న ప్రశ్న ఉదయిస్తోంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో దాక్కున్న ఉగ్రవాదులను జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ ఎన్‌టిఆర్‌ఓ గుర్తించింది. వారి స్థానాల గురించి నిఘా సమాచారాన్ని అందించింది. భారత దాడుల్లో అనేక మంది అగ్ర ఉగ్రవాద కమాండర్లు మరణించి ఉండవచ్చని భారత సైన్యం




అంచనా వేస్తోంది.ఎన్‌టిఆర్‌వో అనేది 2004లో స్థాపించబడిన భారతదేశ సాంకేతిక నిఘా సంస్థ. ఇది జాతీయ భద్రతా సలహాదారు, ప్రధాన మంత్రి కార్యాలయం కింద పనిచేస్తుంది. అధునాతన సాంకేతిక నిఘాను సేకరించడం, భారతదేశ జాతీయ భద్రతను కాపాడటంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఉగ్రవాదం, సైబర్ బెదిరింపులు, సరిహద్దు ముప్పులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కిక్ష అత్యాధునిక సాంకేతికత పరికరాలను ఉపయోగించడం వలన ఉగ్రవాదులను ట్రాక్ చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

---

# చిరుతల్లాంటి మహిళా ఆఫీసర్లు

# వ్యోమికా సింగ్...సోఫియా ఖురేషి



జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ మెరుపు దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించగా.. దాదాపు 100 మంది వరకు ఉగ్రవాదులు హతమైనట్లు- తెలుస్తోంది. భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం ఉదయం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరాలు వెల్లడించారు. మిస్రీతో పాటు ఇద్దరు మహిళా అధికారులు కూడా ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. భారత చరిత్రలోనే తొలిసారిగా ఇద్దరు మహిళా అధికారులు సైనిక్ ఆపరేషన్‌పై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు వీరిద్దరి గురించే యావత్ భారత్ చర్చించుకుంటోంది. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ క్లిష్టమైన ఆపరేషన్ గురించి చెప్పుకొచ్చారు. ఈ ఇద్దరు మహిళా అధికారులు ఎవరన్నది ఆసక్తి కలిగిస్తోంది. పైలెట్ కావాలన్నది వ్యోమికా సింగ్ కల. అందుకోసం ఎంతో కష్టపడ్డారు కూడా. ఇంజనీరింగ్ పూర్తి చేసిన వ్యోమికా.. తన కలను తీర్చుకునే దిశగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే 2004లో ఐఎఎఫ్‌లో చేరారు. 2017లో వింగ్ కమాండ్ హోదా పొందారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా చేతక్, చీతా హెలికాప్టర్లను వ్యోమికా సింగ్ నడిపి రికార్డు సృష్టించారు. వైమానికి రంగంలో ఎంతో పేరు పొందారు. హై-రిస్క్ ఫ్లయింగ్ ఆపరేషన్లలో వ్యోమికా సింగ్ సేవలందించారు. సోఫియా ఖురేషీ స్వస్థలం గుజరాత్. 1990లో సోఫియా సైన్యంలో చేశారు. కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషి.. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి తొలి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. ఇందులో 18 దేశాలు పాల్గొనగా.. కేవలం భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించారు. ఆమెకు



పీస్ కీపర్‌గా ఎంతో అనుభవం ఉంది. 2006 కాంగోలో పీస్ మిషన్‌కు ఆమె అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. మూడు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవలందించారు. ఆమె రాజీలేని వైఖరి, నిర్భయ ప్రయత్నాలతో ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. అలాగే దేశ యువతను భారత సైన్యంలో చేరాలని కూడా సోఫియా ఖురేషి పిలుపునిచ్చారు.

---

## లంకాదహనంలాగా సైన్యం దాడులు

### ఆపరేషన్ సిందూర్‌పై రక్షణమంత్రి రాజ్‌నాథ్




ఆపరేషన్ సిందూర్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లంకాదహనంతో పోల్చారు. హనుమాన్ లంకా దహనం చేసినట్లే.. మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌లోని ఉగ్రదాడుల శిబిరాలపై భారత్ బుధవారం వేకువ జామున దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 50 బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సైనికులు రాత్రి అద్భుత పరాక్రమం ప్రదర్శించారన్నారు. మన సైనికులు రాత్రి ఒక చరిత్ర సృష్టించారన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి సిబ్బంది లేకుండా దాడులు చేశారన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్తిసన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్నారు. ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి సత్తాచాటారన్నారు. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేతమైన దాడి చేశారని.. సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన సైనికులకు అభినందనలు తెలిపారు. సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్‌నాథ్ సింగ్ ధన్యవాదాలు చెప్పారు. పహల్గాంలో అమాయకులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారని ఆరోపించారు. పహల్గాంలో అమాయక పౌరులను చంపిన వారినే మట్టు-బెట్టినట్లు- పేర్కొన్నారు. శత్రువకు సరైన బుద్ధి చెబుతామన్నారు. దేశభద్రకు భంగం కలిగించే చర్యలను సహించమన్నారు. ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులు చేశామన్నారు. లంకా దహనం చేసిన హనుమంతుడే మాకు ఆదర్శమని.. హనుమాన్ లంకా దహనం చేసినట్లే మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత్ లక్ష్యం పాకిస్తాన్ కాదని.. ఉగ్రవాదులేనన్నారు.



# సాయిపల్లవి భారీ రెమ్మ్యునరేషన్ పై బాలీవుడ్ లో తీవ్ర చర్చ

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న భారీ ప్రాజెక్టుల్లో 'రామాయణ' ఒకటి. ప్రముఖ దర్శకుడు నితేశ్ తివారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. అయితే, ఈ సినిమాకు సంబంధించి సాయి పల్లవి పారితోషికంపై ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన వార్త బీ-టౌన్‌లో చక్కర్లు కొడుతూ, తీవ్ర చర్చకు దారితీసింది.

ఈ 'రామాయణ' కోసం సాయి పల్లవి ఏకంగా రూ. 13 కోట్ల పారితోషికం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే, భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక నాయిక ఇంత భారీ మొత్తంలో రెమ్యూనరేషన్ అందుకోవడం ఇదే ప్రథమం అవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రావణాసురుడి పాత్రలో శాండల్‌వుడ్ స్టార్ యష్ కనిపించనుండగా, సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా వంటి వారు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారని సమాచారం. సీత పాత్రకు దక్షిణాది నటి సాయి పల్లవిని ఎంపిక చేయడంపై కొందరు బాలీవుడ్ నటీమణులు అసంతృప్తి వ్యక్తం చేశారని, "బాలీవుడ్‌లో నటీమణులే కరవయ్యారా? పొరుగు రాష్ట్ర నటిని ఎందుకు తీసుకోవాలి?" అని మండిపడ్డారని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి.ఈ భారీ పారితోషికం వార్త బయటకు రావడంతో, సాయి పల్లవిపై నెట్టింట కొందరు ప్రతికూలంగా స్పందిస్తున్నారు. ముఖ్యంగా బాలీవుడ్ పరిశ్రమకు చెందిన కొందరు, "సాయి పల్లవికి అంత మొత్తం ఇవ్వాల్సిన అవసరం ఉందా? ఆమెకు అంత సీన్ ఉందా?" అంటూ ఘాటుగా విమర్శిస్తున్నట్లు సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో పారితోషికం అందుకోవడానికి ఆమె అర్హురాలేనా అనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి.అయితే, సాయి పల్లవి నిజంగానే రూ.13 కోట్లు డిమాండ్ చేశారా? లేదా ఇవి కేవలం వదంతులేనా? అనే విషయంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వస్తే కానీ స్పష్టత వచ్చే అవకాశం లేదు. ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.



## బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌తో అల్లు అర్జున్

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు- చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్‌లో నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ- సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను ఇటీ-వల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు- తెలిపారు.

# తెలుగు వెబ్ సీరిస్‌లోకి కోవై సరళ



లేడీ కమెడియన్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే పేరు కోవై సరళ. అప్పట్లో ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగింది. ముఖ్యంగా బ్రహ్మానందం, కోవై సరళ జోడికి ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉండేవారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి, తనదైన బాషతో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో దాదాపు రెండు దశాబ్దాల పాటు కోవై సరళ అందరినీ మెప్పించింది. అయితే కారణాలు ఏవైనా ఆమె కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైంది. తెలుగు అని కాదు తమిళంలో కూడా అడపాదడపా సినిమాలు చేస్తోంది. అలా తెలుగులో డబ్ అయ్యి వచ్చిన సినిమాలను మాత్రమే తెలుగు వాళ్ళు చూసి ఆనందించాల్సిన వస్తుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు కోవై సరళ ఓ తెలుగు వెబ్ సీరిస్ లో ఎంట్రీ ఇస్తోందట. యంగ్ హీరోయిన్ రీతూ వర్మ, శివ కందుకూరి జంటగా నటిస్తున్న వెబ్ సీరీస్ 'దేవిక అండ్ డానీ'. ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇటీవలే రిలీజ్ అయింది. రీతూవర్మ కు ఇదే మొదటి వెబ్ సీరిస్. 'శ్రీకారం' మూవీ ఫేమ్ బి. కిశోర్ ఈ వెబ్ సీరిస్ ను డైరెక్ట్ చేశాడు. అతనితోపాటు- ఇందులో సూర్య వశిష్ఠ, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జయ్ క్రిష్ దీనికి మ్యూజిక్ అందించాడు. త్వరలో ఈ వెబ్ సీరిస్ జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది. మరి కోవై సరళ కామెడీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న తెలుగువారికి ఆమె ఈ వెబ్ సీరిస్ తో ఎలాంటి వినోదాన్ని పండిస్తుందో చూడాలి.




## ఆయన ఒప్పుకున్నాక మరింత నమ్మా!

కెరీర్ స్టార్టింగ్ నుంచి విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేసి వాటితో ఆడియన్స్ ను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ శ్రీవిష్ణు. ఈ టాలెంటెడ్ నటుడు నటించిన తాజా సినిమా సింగిల్. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్, ట్రైలర్ ప్రామిసింగ్ గా ఉండటంతో సింగిల్ పై మంచి అంచనాలేర్పడ్డాయి.సింగిల్ సినిమా మే 9న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా శ్రీవిష్ణు మీడియాతో మాట్లాడి సినిమా గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించాడు. డైరెక్టర్ కార్తీక్ రాజు చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని, అందుకే వెంటనే ఈ సినిమాను ఓకే చేశానని శ్రీవిష్ణు చెప్పాడు. వెన్నెల కిషోర్ కూడా ఈ సినిమాలో నటించడానికి ఒప్పుకున్న తర్వాతే ఈ సినిమా 100% సక్సెస్ అవుతుందని భావించినట్టు కూడా శ్రీవిష్ణు తెలిపాడు.సినిమాలో తనకు వెన్నెల కిషోర్ కు మధ్య వచ్చే సీన్స్ ఎంతో సరదాగా ఉంటాయని చెప్పిన శ్రీవిష్ణు ఈ సినిమాలోని లవ్ స్టోరీ చాలా కొత్తగా ఉంటుందని, గత సినిమాల కంటే ఈ సినిమా స్క్రీన్ ప్లే చాలా విభిన్నంగా ఉంటుందని చెప్పాడు. సింగిల్ సినిమా చాలా క్లియర్ గా, కుటుంబ సమేతంగా చూసి ఆనందించేలా ఉంటుంది శ్రీవిష్ణు వెల్లడించాడు.సినిమాలో ఒక్క డల్ మూమెంట్ కూడా ఉండదని, సినిమా చూసినంతసేపూ నవ్వుతూనే ఉంటారని చెప్పిన శ్రీవిష్ణు ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ అందించిన మ్యూజిక్, బీజీఎం సినిమా స్థాయిని మరింత పెంచిందని చెప్పుకొచ్చాడు. విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమాను అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా విజయంపై శ్రీవిష్ణు చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు.

# జెట్ స్పీడ్ లోనే రవితేజ న్యూ కాంబో!



మాస్ మహారాజ్ రవితేజ ఎప్పుడూ కూడా వైవిధ్యమైన కథలతో అభిమానులను అలరించేందుకు ప్రయత్నిస్తాడు. 'క్రాక్', 'ధమాకా' సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న రవితేజ, తన స్టైల్‌లో మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌తో బాక్సాఫీస్ షేక్ చేశాడు. కానీ, ఈ మధ్య కొన్ని సినిమాలు అతని ఇమేజ్‌కు తగ్గట్టుగా లేకపోవడంతో డిజాస్టర్స్‌గా మిగిలాయి.'రావనసుర', 'టైగర్ నాగేశ్వరరావు', 'ఈగల్', 'మిస్టర్ బచ్చన్' సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో రవితేజ తన కొత్త సినిమాలతో మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తున్నాడు. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమా రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది.భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది. ఈ సినిమాతో రవితేజ మళ్లీ బాక్సాఫీస్ వద్ద సందడి చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. మాస్ జాతర సినిమా తర్వాత రవితేజ కొత్త ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించడానికి సిద్ధమవుతున్నాడు. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం, రవితేజ కిషోర్ తిరుమలతో ఓ కొత్త సినిమా స్టార్ట్ చేయబోతున్నాడు.ఈ సినిమా షూటింగ్ జూన్ 3, 2025 నుంచి మొదలవుతుందని టాక్. ఈ ప్రాజెక్టుని కూడా మాస్ రాజా జెట్ స్పెస్ లోనే ఫినిష్ చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ చేయాలని చూస్తున్నారట. ఇక 'చిత్రలహరి', 'రెడ్' సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కిషోర్ తిరుమల, ఈ సినిమాలో రవితేజతో ఓ ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తీసుకొస్తున్నాడు. ఈ సినిమాకు కూడా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. మంచి ట్రీట్ ఇవ్వనుందని అంటున్నారు.సినిమా కథ వివరాలు ఇంకా బయటకు రాలేదు,

# ప్రశాంత్ వర్మ యూనివర్స్ లోకి మెగా హీరో!





మెగా వారసుడు వరుణ్ తేజ్ ప్రయోగాలు చేయడంలో ఏమాత్రం వెనుకడుగు వేయని హీరో. మెగా హీరోల్లో అతడు అందుకే స్పెషల్ అయ్యాడు. ఎంతో మంది హీరోలున్నా? ఎవరు చేయని ప్రయోగాలు చేసి తనకం టూ ప్రత్యేకమైన ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. ప్రయోగాలన్నీ సక్సెస్ కానప్పటికీ వరుణ్ ఇమేజ్ మాత్రం ఎక్కడా చెక్కు చెదరలేదు. ఇది అతడి ప్రతిభకు తార్కాణం. డిఫరెంట్ జానర్ చిత్రాలు ఫెయిల య్యాయని వరుణ్ వెనక్కి తగ్గడం లేదు.డిఫరెంట్ కాన్సెప్ట్ లు ఏవీ తన దగ్గరకు వచ్చినా? బాగుంది అంటే నో చెప్పకుండా లాక్ చేస్తున్నాడు. తాజాగా వరుణ్ తేజ్ , ప్రశాంత్ వర్మ యూనివర్స్ లోకి అడుగు పెడు తున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ తనకంటూ ఓ యూనివర్స్ ని క్రియేట్ చేసుకుని సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. వేరు వేరు కథలతో సినిమాలు చేస్తూనే మరోవైపు తన యూనివర్స్ ని కూడా కంటున్యూ చేసేలా ప్రణాళిక సిద్దం చేసి పెట్టుకున్నాడు.ప్రస్తుతం %-%కాంతార%-% ఫేం రిషబ్ శెట్టితో %-%జై హనుమాన్%-% చిత్రం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇది %-%హనుమాన్%-% కి కంటున్యూ గా వస్తున్న చిత్రం. దీన్ని యూనివర్స్ లో కి తీసుకొచ్చి రకరకాల చిత్రాలు చేయడానికి సంకల్పించాడు. ఇదే యూనివర్స్ లో భాగమవ్వాలని మెగాస్టార్ చిరంజీవి సైతం ఆశాభావం వ్యక్తం చేసారు. కానీ ప్రశాంత్ వర్మ ఆలోచనల్లో చిరంజీవి కనిపించలేదు. ఆయన లేకపోయినా వాళ్ల బ్బాయి వరుణ్ తేజ్ ఇప్పుడు ఇదే యూనివర్స్ లోకి ఎంటర్ అవ్వడం ఇంట్రెస్టింగ్.పీసీయూ నుంచి చాలా సినిమాలు చేసే అవకాశం ఉంది. అందులో ఓ చిత్రంలో వరుణ్ తేజ్ నటించే అవకాశాలున్నాయి. కానీ అదెప్పుడు జరుగుతుంది? అన్నది మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది పూర్తయిన తర్వాత పీసీయూ పై మరికొంత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613